## మద్యం సేవిస్తేనే అంగస్తంభనం

**నా వయస్సు 42 సం॥లు. వయసులో ఉండగా స్త్రీ స్పర్శకోసం మనసు తహతహలాడేది. శరీరమంతా పులకించేది.**

**పెండ్లయిన తర్వాత భార్యతో సంభోగంలో ఎంతో మధురానుభూతి కలిగేది. కాని ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయినది.**

**మద్యం సేవిస్తేనే అంగస్తంభనం దృఢంగా ఉంటుంది. భార్యను సంతోషపరచ గల్గుతున్నాను. త్రాగ కుండా సంభోగములో పాల్గొంటే సరిగా రమించలేక పోతున్నాను. త్రాగకుండా రతిలో పాల్గొంటే సహజానుభూతి కల్గుతుందని తెలుసు కావున మంచి సలహా యివ్వగలరు. మీరొక వేళ నాకు హార్మోన్ ట్రీట్‌మెంట్ ప్రిఫర్ చేస్తే ఎంత కాలం వాడాలి.**

**నాకు పురుషాంగానికి గాని, వృష ణాలకు గాని ఎలాంటి జబ్బులు లేవు. దయచేసి నా పరిస్థితిని అర్థము చేసుకొని సలహా సూచించగలరు.**

**- ఎ., మెండోర.**

జ. తాగకుండా రతిలో పాల్గొంటే అంగం సరిగా స్తంభించటం లేదన్నారు. తాగితేనే భార్యని సంతోషపెట్ట గలుగుతున్నానన్నారు.

మీరు తాగి రతిచేస్తే తాను సంతోష పడుతున్నదీ, లేనిదీ మీ భార్యనడిగేరా? ఆ త్రాగుడు మైకంలో "సంతోష పెట్టగల్గుతున్నాననే" భ్రమలో మీరున్నారా అని మా అనుమానం.

అదలా ఉంచండి. ఆల్కహాలు మనసులో ఉండే అడ్డుల్ని నిషేధాల్ని తొలగిస్తుంది. కనుక తాగిన వాడికి మానసిక ఆటంకాలు పోయి అంగం స్తంభిస్తుంది. తాగనప్పుడు స్తంభించడం లేదంటే మీ మనసులో సెక్సుకి సంబంధించో, మీ భార్యకు సంబంధించో మానసిక అవరోధాలు ఏవో ఉన్నాయన్నమాట!

ఏమిటా అవరోధాలు? మీ లైంగిక సామర్థ్యం మీద మీకు నమ్మకం చాలటం లేదా? భార్య మీద నమ్మకం పోయిందా? లేక ఆమె ఆకర్షణీయంగా కనబడ్డంలేదా? ఇంకేదైనా సందేహా లున్నాయా ఆలోచించుకుని మా వద్దకు రండి. వాటిని తొలగిస్తే మీ సెక్సు సమస్య తొలగి పోతుంది. ఆల్కహాలు (త్రాగుడు) తాత్కాలికంగా మీకిలా ఉపయోగపడినా చివరకు అది నపుంసకత్వాన్నే కలిగిస్తుంది. కనుక దాన్ని విడిచి పెట్టడమే మంచిది.

అంగస్తంభన సరిగ్గా జరక్క పోవడానికి యిదొక్కటే కారణమని మా ఉద్దేశం కాదు. నరాల దోషాలు, రక్తనాళ ధోషాలు, హార్మోను దోషాలు, అనారోగ్యాలు, మందుల వాడకం, స్మోకింగ్, వెన్నుముకకి దెబ్బ తగలడం... ఇలా ఎన్నో కారణాలుంటాయి. ఎక్కడ కారణం ఉందో

తెలియడానికి మరింత లోతుగా యింటర్వ్యూ చెయ్యాలి. పరీక్షలు చేయించాలి. అప్పుడు కాని దాని అసలు స్వభావం తెలీదు. అందుకే రమ్మన్నాము.

**ఇంకోటి:** హార్మన్ థిరపీ ఎవరికీ... అంటే - హార్మోన్ లోపం ఉన్న వాళ్ళకే! పురుష హార్మోను లోపం ఉంటే కోరికలు తక్కువగా ఉంటాయి. అలాంటప్పుడు తాగినా సెక్సుకోరికలేమీ కలగవు. అది గమనించండి.